క్లుప్తంగా

విదేశీ విద్యా దీవెనతో ఉన్నత చదువులు

చిలకలపూడి(మచిలీపట్నం): జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ద్వారా విదేశాల్లోని విద్యా సంస్థల్లో ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. మచిలీపట్నంలో శుక్రవారం పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఎన్నో ప్రోత్సాహకాలు అందిస్తుందని చెప్పారు. ఒక్కొక్క విద్యార్థికి రూ. 50 లక్షల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను అందిస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో 12 మంది విద్యార్థులకు రూ. 1.12 కోట్లు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేశామని వెల్లడించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ కె.సరస్వతి, బీసీ సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మీదుర్గ, గిరిజన సంక్షేమశాఖ అధికారి ఎం.ఫణిదూర్జటి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విజయవాడరూరల్: సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. నున్నలో ఏఎన్‌ఎం నాగేశ్వరావు, పాతపాడు గ్రామంలో ఏఎన్‌ఎం నవత, పి.నైనవరం గ్రామంలో ఏఎన్‌ఎం మురళీకృష్ణ, అంబాపురం గ్రామంలో ఏఎన్‌ఎం భూలక్ష్మి ఆషావర్కర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు.

సమర్థంగా పింఛన్ల పంపిణీ

కంకిపాడు: సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియ సమర్థంగా సాగుతోందని ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె వివరాలు తెలుపుతూ మండలంలోని 18 సచివాలయాల పరిధిలో ఫిబ్రవరి నెలకు 8,997 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఇందుకు గానూ రూ. 2.47 కోట్లు సొమ్ము విడుదలైందన్నారు. ఇప్పటికే 8,699 మంది లబ్ధిదారులకు పంపిణీ పూర్తయ్యిందని, రూ. 2.38 కోట్లు లబ్ధిదారులకు అందించారన్నారు. పింఛన్ల పంపిణీ 96.73 శాతంగా నమోదైందని పేర్కొన్నారు.

కానూరులో వార్డెన్ అదృశ్యం

పెనమలూరు: కానూరులో వార్డెన్‌గా పని చేస్తున్న మహిళ అదృశ్యం అవ్వటంతో పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం మైలవరం మండలం చంద్రగూడెం గ్రామానికి చెందిన మహిళ (20) కానూరులో ప్రైవేటు అకాడమీలో గత కొద్ది కాలంగా వార్డెన్‌గా పని చేస్తుంది. అయితే ఆమె గురువారం హాస్టల్ నుంచి అదృశ్యమైందని ఆమె తండ్రి మల్లేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటనపై పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

13న జాతీయ రహదారుల దిగ్బంధం

నున్న(విజయవాడరూరల్): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో ఎస్సీ రిజర్వేషన్ల బిల్లు ప్రవేశపెట్టి, చట్టబద్ధత కల్పించాలని మహాజన సోషలిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు, మండల పరిశీలకుడు ముమ్మడివరపు చిన్న సుబ్బారావు మాదిగ డిమాండ్ చ చేశారు. శుక్రవారం నున్న గ్రామంలో గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కన్వీనర్ మంద వేణుమాదిగ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చిన్న సుబ్బారావు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈ నెల 13వ తేదీన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారుల దిగ్బంధం చేస్తున్నామన్నారు. గన్నవరం నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం శేరినరసన్నపాలెంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తల్లిదండ్రులకు చెందిన ఇంట్లో ఇటీవల చోరీకి పాల్పడిన దొంగలను వీరవల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసు వివరాలను హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మీడియాకు వివరించారు. బాపులపాడు జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు కైలే జ్ఞానమణి, సంజీవరావు దంపతులు తమ నివాసానికి తాళం వేసి పామర్రులోని కుమారుడు అనిల్ కుమార్ ఇంటికి వెళ్లటాన్ని అదే ప్రాంతంలో ఉంటున్న బాణాల దుర్గారావు గుర్తించాడని సీఐ నవీన్ నరసింహమూర్తి తెలిపారు. ఆ ఇంట్లో చోరీ చేయాలనే దుర్బుద్ధితో తరచూ చిన్న, చిన్న దొంగతనాలు చేసే తన స్నేహితుడు కరటూరి రాజు, అతని బామ్మర్ది జోజిలతో కలిసి పథకం వేశాడు. రాత్రి సమయంలో కిటికి తలుపు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బంగారు వస్తువులు దొంగిలించారు. వాటిని విజయవాడలో అమ్ముకుని జల్సాలు చేసినట్లుగా విచారణలో వెల్లడించారని సీఐ నవీన్ నరసింహమూర్తి చెప్పారు. అలాగే వీరవల్లి, తాళ్లమూడి ప్రాంతాల్లోనూ మరో మూడు చోట్ల బడ్డీ కొట్లు, ఇళ్లలోనూ దొంగతనాలు చేసి టీవీ, ఫ్రిడ్జ్, గ్యాస్ సిలెండర్, సిగరెట్ ప్యాకెట్లు దొంగిలించినట్లు విచారణలో తెలిసిందని వివరించారు. ఈ ముగ్గురు నిందితులను నూజివీడు కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. వీరిని పట్టుకునేందుకు కృషి చేసిన వీరవల్లి ఎస్ఐ సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

పేదల అభ్యున్నతితోనే సమాజం క్షేమం



చోడవరం గడప గడప కార్యక్రమంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: పేదలు అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన శుక్రవారం చోడవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల బ్రోచర్ లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నేడు రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల వల్ల ప్రజలు ఆర్థికంగా లబ్ధిపొంది సంతృప్తిగా ఉన్నారన్నారు. గతంలో ఎన్ని ప్రభుత్వాలు పరిపాలన సాగించినా జగనన్న సీఎం అయిన తర్వాతనే పేదల జీవితాల్లో వెలుగు వచ్చిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సైతం కార్పొరేట్ పాఠశాలలుగా తీర్చి దిద్దారని అన్నారు. చేతివృత్తి దారులు, రైతులు, పేదలకు ప్రభుత్వం నేరుగా ఆర్థిక సాయం అందిస్తుందని, ఇందులో దళారుల ప్రమేయం, అవినీతికి ఆస్కారమే లేదన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి జగనన్న చరిత్రలో నిలిచిపోయారన్నారు. ప్రభుత్వ పథకాలు పొందుతున్న ప్రతి ఒక్క లబ్ధిదారుడు జగనన్న చేస్తున్న మేలును గుర్తుంచుకోవాలని కోరారు.

చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు..

పేదల సంక్షేమ పట్ల చంద్రబాబునాయుడికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆరోపించారు. జనన్న సంక్షేమ పథకాలు పేదలకు అమలు చేస్తుంటే కుట్రతో సంక్షేమ పథకాలకు గ్రహణం పట్టించాలని ప్రతిపక్ష టీడీపీ నేతలు యత్నిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు పాలనలో పేదలకు ఆయన ఏమి చేశాడో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో పేదలే చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతారని పార్థసారథి అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాకర్ల వెంకటరత్నం, వైఎస్సార్ సీపీ నేతలు మండూరు కోటేశ్వరరావు, మానికొండ సూర్యతేజ, కొత్తపల్లి వెంకటేశ్వరరావు, చోడవరపు శ్రీనివాసరావు, శీలం రవిచంద్, లింగాల సాంబశివరావు, చోడవరపు రవిచంద్, ఆత్మకూరి పవన్‌కుమార్, లాం రామారావు, అద్దేపల్లి నాగేశ్వరరావు పి.ప్రవీణ్, జడ బాబు, పలువురు పాల్గొన్నారు.

జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి



జాబ్ మేళాను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ సరోజిని

ఉంగుటూరు: యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని సూచించారు. తేలప్రోలులో ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ ఛేంజ్ సంయుక్త ఆధ్వర్యంలో సంకల్ప్ పథకం కింద మెగా జాబ్ మేళా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ నియోజకవర్గంలో పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ద్వారా నాణ్యమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో ఎఫ్టానిక్స్, చందు సాఫ్ట్ టెక్నాలజీ, కియా మోటర్స్, హెటిరో లాబ్స్, ముత్తూట్ ఫైనాన్స్, గోల్డ్ ప్రిన్స్ జెవెల్ ఇండస్ట్రీ, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటర్స్, మోహన్ స్పిన్ టెక్స్, పేటియం, బిగ్‌బాస్కెట్, నవత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వంటి 15 ప్రముఖ కంపెనీలు పాల్గొన్నారని చెప్పారు. జాబ్‌మేళాకు 632మంది హాజరు కాగా వారిలో 124మంది ఎంపికయ్యారని, తదుపరి ఇంటర్వ్యూలకు మరో 176 మంది ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి అధికారి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పీఎస్ ప్రసాద్, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి పీవీ రమేష్, సుమలత, కళాశాల డైరెక్టర్ కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు



పెద ఓగిరాలలో మినుము పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ఉయ్యూరు: యాజమాన్య చర్యలతో అధిక దిగుబడులు సాధించొచ్చని శాస్త్రవేత్తల బృందం సూచించింది. మండలంలోని పెద ఓగిరాల గ్రామంలోని మినుము, మొక్కజొన్న, చెరకు పైర్లను శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. లాం ఫామ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వెంకట్రావు, జన్యుశాస్త్రవేత్త డాక్టర్ హరిసత్యనారాయణ, తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కిశోర్ వర్మ, కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ కామాక్షి, ఉయ్యూరు డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ నంద కిశోర్, టీటీటీ అచ్యుతరావు రైతులు, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులతో కలిసి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మినీకిట్‌గా రైతులకు అందుబాటులో ఉంచిన ఎల్‌బీజీ 932 వంగడం పల్లాకు తెగులును తట్టుకుని ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు, చెరకులో లీఫ్ హాపర్ నివారణ చర్యలపై రైతులకు సూచనలు ఇచ్చారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో అగ్ని ప్రమాదం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం రంగన్నగూడెంలో మాజీ సర్పంచ్ మైనేని గోపాలరావు నివాసంలో వంట గ్యాస్ లీకై పేలుడు సంభవించింది. శుక్రవారం ఉదయం ఆయన నిద్ర లేచిన తర్వాత యథావిధిగా గదిలో లైట్ వేసేందుకు స్విచ్ ఆన్ చేయగా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. రాత్రంతా గదిలో గ్యాస్ లీకై ఉండటంతో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఈ పేలుడుతో ఇంట్లోని సామగ్రి మొత్తం చిందరవందర కావటంతో పాటుగా, గుమ్మాలకు ఉన్న చెక్క తలుపులు సైతం పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా, అప్పటికే సిలిండర్ నుంచి గ్యాస్ లీకు అవటం, కరెంట్ స్విచ్ ఆన్ చేయటంతో ఒక్కసారిగా మంటల చెలరేగినట్లుగా స్థానికులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో మైనేని గోపాలరావు మోకాలు కింది భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన చిన్నవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతానికి ఆయనకు ప్రాణపాయం లేదని, కాలిన శరీర భాగాలు చికిత్స చేస్తున్నామని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. దీనిపై సమాచారం అందుకున్న వీరవల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. బాధితుడు మైనేని గోపాలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

కంకిపాడు: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తిచేశారు. గన్నవరంలో సంకల్పదీక్షకు తరలివెళ్లిన పలువురు ఉపాధ్యాయులను శుక్రవారం కంకిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఉపాధ్యాయులు, యూటీఎఫ్ నేతలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. 2004లో అమలులోకి వచ్చిన సీపీఎస్ విధానం ఉద్యోగుల జీవన భద్రతను ప్రశ్నార్థకం చేస్తుందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జీపీఎస్ విధానంతో పూర్తి ప్రయోజనం ఉండదని, సీపీఎస్ రద్దు చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు జే.రమేష్ చంద్రపట్నాయక్, డి.రాము, జే.వినయ్‌కుమార్, కమల్, పీవీ ప్రసాద్, లింగమయ్య, వి.కనకదుర్గ, జే.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద వద్ద సర్వీస్ రోడ్డు నిర్మించాలని వినతి



ముస్తాబాదలో రైతుల వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో పద్మావతి

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం గ్రామసభ జరిగింది. ముస్తాబాద సమీపంలో నిర్మాణం అవుతున్న నేషనల్ హైవే వెంట సర్వీస్ రోడ్డు నిర్మించాలని ఇప్పటికే పలుమార్లు రైతాంగం అధికారులకు అర్జీలు అందజేశారు. దీంతో గుడివాడ ఆర్డీవో పద్మావతి ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాలను సేకరించారు. వినతి పత్రాలు స్వీకరించారు. కొండపావులూరుకు చెందిన రైతులు ఉప్పుగంటి రాజేష్, ఓబిళనేని శ్రీకాంత్ ఆర్డీవోకు సమస్య వివరించారు. నేషనల్ హైవే బైపాస్ నిర్మాణం జరిగిందని, ఈ హైవే పైకి రైతులు వెళ్లేందుకు ఇప్పుడు ఉన్న మార్గం కూడా అనుకూలంగా లేదని చెప్పారు. నేషనల్ హైవేపై వచ్చే వాహనాలు అమిత వేగంతో వెళతాయని, ఆరోడ్డు పైకి రైతులు చేరుకుని ప్రయాణం చేయటం శ్రేయస్కరం కాదని చెప్పారు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే నేషనల్ హైవే పైకి వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. రైతాంగం వినతులను స్వీకరించిన ఆర్డీవో ఉన్నతాధికారులకు నివేదిస్తామని రైతాంగానికి హామీ ఇచ్చారు. తహసీల్దార్ సీహెచ్ నరసింహారావు, సర్పంచ్ వి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'మానవత' శాంతి రథం డ్రైవర్ మృతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాంతిరథం డ్రైవర్ షేక్ బాషా (65) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. పార్థీవ దేహాలను శ్మశాన వాటికను తరలించే శాంతి రథం వ్యాన్ డ్రైవర్‌గా పని చేస్తున్న బాషా మృతికి మానవత సభ్యులు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మానవత తరఫున రూ. 10 వేలు తక్షణ సాయంగా అందజేశారు.

వైద్య శిబిరం ప్రారంభం



ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లలో వసతుల కల్పనపై అధికారులు దృష్టిసారించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురికాకుండా ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యంగా మున్సిపాలిటీ చర్యలు చేపట్టింది. ప్రసాదాల పంపిణీ, తాగునీటి సరఫరాతో పాటుగా శుక్రవారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రారంభించి, భక్తులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, డాక్టర్ తేజస్విని, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదాలు పంపిణీ..

వీరమ్మతల్లి తిరునాళ్లు శుక్రవారం నాలుగో రోజుకు చేరాయి. ఆలయ ప్రవేశం చేసిన శ్రీ కనక చింతయ్య సమేత వీరమ్మతల్లిని శుక్రవారం భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించారు. మహిళలు పాలపొంగళ్లు చేసి అమ్మకు నైవేద్యం సమర్పించారు. వెంట్రప్రగడ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పులిహోర, చక్రపొంగలి అందించి తల్లి సేవలో తరించారు.

వలంటీర్ సేవలకు అభినందన



గన్నవరం రూరల్: వీరపనేనిగూడెం గ్రామసచివాలయంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ధారావతు కరుణ శుక్రవారం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న గ్రామానికి చెందిన పెన్షన్ లబ్ధిదారు షేక్ ఆషాబీకి పెన్షన్ అందజేశారు. జ్వరంతో ఇబ్బంది పడుతున్న ఆషాబీ చికిత్స కోసం విజయవాడలో ఉన్న విషయం తెలుసుకున్న వలంటీర్ సేవా భావంతో అక్కడికి వెళ్లి నగదు అందజేశారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

పెనమలూరు: మండలంలో పలు గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ చేశామని ఎస్టీయూ కృష్ణా జిల్లా కార్యదర్శి పి.ఇమ్మానుయేలు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు తెలుపుతూ మండల పరిధిలో చోడవరం, పెదపులిపాక, తాడిగడప, యనమలకుదురు గ్రామాల్లో ఎస్టీయూ సభ్యత్వ నమోదు క్యాంపెయిన్ చేశామన్నారు.

యూటీఎఫ్ నేతల నిరసన

పెనమలూరు: సంకల్ప దీక్ష చేయటానికి యత్నించిన యూటీఎఫ్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవటంతో నేతలు పోలీస్‌స్టేషన్‌లో నిరసన వ్యక్తం చేశారు. గన్నవరం వద్ద యూటీఎఫ్ నేతలు అనుమతి లేకుండా ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు 42 మందిని అదుపులోకి తీసుకుని పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. తమను అన్యాయంగా పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని యూటీఎఫ్ నేతలు నిరసన వ్యక్తం చేశారు.

దీక్ష అడ్డగింత..

గన్నవరం: అనుమతులు లేకుండా యూటీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస హేచరీస్ సమీపంలోని సుందరయ్య విద్యానగర్‌లో శుక్రవారం చేపట్టిన సంకల్ప దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా దీక్షకు వస్తున్న ఉపాధ్యాయులను ఎక్కడికక్కడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం విడుదల చేశారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



కాలనీలో పర్యటిస్తున్న తహసీల్దార్ సతీష్, కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: వణుకూరులో జగనన్న కాలనీలో పోరంకి వాసులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో వెంటనే గృహాలు నిర్మాణం చేపట్టాలని తహసీల్దార్ టీవీ. సతీష్ అన్నారు. ఆయన తాడిగడప మునిసిపాలిటీ కమిషనర్ ఎస్.ప్రకాశరావుతో శుక్రవారం వణుకూరులో ఉన్న లేఅవుట్ రెండును పరిశీలించారు. తహసీల్దార్ సతీష్ మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు సంబంధించి సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ రూ. 1.80 లక్షలు ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. ఇసుకకు కూపన్‌లు కూడా జారీ చేస్తామన్నారు. భవన నిర్మాణ మెటీరియల్ కూడా వెంటనే ఇస్తామని, ప్రభుత్వం కూడా లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో సొమ్ము సకాలంలో జమ చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శివరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు



హనుమాన్‌నగర్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీమోహన్

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్ రూరల్: అర్హులైన ప్రతి సంక్షేమ పథకాలను కూడా అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. మండల కేంద్రమైన బాపులపాడులోని గ్రామ సచివాలయం-2 పరిధిలోని హనుమాన్ నగర్‌లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. వలంటీర్లు, గ్రామ సచివాలయం అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరించారు. గడిచిన మూడేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను సవివరంగా తెలుసుకుని, వాటిని స్వయంగా ఆయన డైరీలో నమోదు చేసుకున్నారు.ముఖ్యంగా డ్రైనేజీ నిర్మాణం, ఫించన్లు, ఇళ్ల స్థలాలు, హౌసింగ్ లోన్లు మంజూరు కోసం ఎమ్మెల్యేకు పలువురు విజ్ఞప్తులు అందజేశారు. గ్రామంలో పలుచోట్ల పేద విద్యార్థుల చదువుకు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు ఆయన సొంత నిధులను ఆర్థికసాయంగా అందించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన..

రూ.16 లక్షల వ్యయంతో డ్రైనేజీతో సహా నిర్మించనున్న సీసీ రోడ్డుకు స్థానికులతో కలిసి ఎమ్మెల్యే వంశీ మోహన్ శంకుస్థాపన చేశారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బందితో సమావేశమై ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులపై చర్చించారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులతోనూ ఆయన సమావేశమైయ్యారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ సక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నాగేష్, సర్పంచ్‌లు సరిపల్లి కమలాభాయి, కాటూరి విజయభాస్కర్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దయాల విజయనాయుడు, పీఏసీఎస్ చైర్మన్లు చిన్నాల సత్యగణేష్ బాబు, మూల్పూరు ప్రభుకాంత్, అల్లాడి ధెరిస్సా, వైఎస్సార్ సీపీ నాయకులు కొమరవల్లి కిరణ్‌మూర్తి, కట్టా వాసు, వరిగంజి కిషోర్, చందు నరేంద్ర, ఊబా వెంకటేశ్వరరావు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణ గానామృతం



శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం జరుపుతున్న అర్చకులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో రజతోత్సవ కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం శ్రీవేంకటేశ్వర కల్యాణ గానామృతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలంలోని సింగరాజుపాలెంకు చెందిన శ్రీమురళీకృష్ణ భజన మండలి చేసిన కల్యాణ గానామృతం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారికి శాస్త్రోక్తంగా వేద పండితులు కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం అమ్మవారి సన్నిధిలో కుంకుమార్చనలు, శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. తానా మాజీ అధ్యక్షుడు టీబీఆర్ ప్రసాద్, ఉపసర్పంచి పాలడుగు నాని, పుర ప్రముఖులు నెక్కలపూడి ఈశ్వరరావు, మండవ వెంకటప్రభాకరరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, కోశాధికారి జాస్తి ఫణిశేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి



వృద్ధులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కంకిపాడు: కంటి వెలుగు కార్యక్రమాన్ని అవ్వాతాతలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పులూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ సూచించారు. మండల కేంద్రమైన కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్-3 కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుందర్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళ్ల నుంచీ నీరు కారటం, కళ్లు దురదలు, ఇతర కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. అవ్వాతాతలు శిబిరానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ 120 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీసీ సంఘ నేతలు

పెనమలూరు: యనమలకుదురులో శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి బీసీ సంఘ నేతలు క్షీరాభిషేకం చేశారు. పేద, బలహీన వర్గాల విద్యార్థులకు జగనన్న విదేశీ విద్యాదీవెన నిధులు విడుదల చేసిన సందర్భంగా బీసీ సంఘ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మారేష్, కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్, నేతలు నాగేంద్రబాబు, ఆకునూరు సుబ్బారావు,మహిధర్ పలువురు పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్ద పీట



క్రీడాకారులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ఉయ్యూరు: క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణానికి చెందిన పలువురు క్రీడాకారులు 66వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ చాటారు. గత నెల 31వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకూ రాజమండ్రిలో జరిగిన పోటీల్లో బాక్సింగ్‌లో కె.గణేష్‌రావు, బాల సందీప్‌కుమార్ వెండి పతకాలు, విష్ణుతేజ కాంస్య పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం పతకాలు అందించి అభినందించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు మురాల వెంకటేశ్వరరావు (అయ్య), కోచ్ సూర్యనారాయణను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులు మరింత రాణించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాన కొండలరావు పాల్గొన్నారు.